# అరాచకీయ బాధితులు

వెనుక శ్రీరాములవారు భరత ఖండాన్ని మూడు పువ్వులూ, ముప్పై కాయలుగా పాలిస్తూన్న పుణ్యకాలంలో...

ఓ సుదినాన ఏకాంత సమయంలో ఆంజనేయులవారు శ్రీవారి సమ్ముఖాన హాజరై, సాష్టాంగ దండప్రణామ మాచరించిన వారై...

స్వామీ, నేనీ జీవితంతో విసుగెత్తి పోతున్నాను. నాకు మార్గోప దేశం చేయండి'' అని విన్నవించుకొన్నారు.

అందుకు శ్రీరాముల వారికి చాలా ఆశ్చర్యమైనది.

"ఏమి ఆంజనేయా ! నీకిప్పుడేమి లోటైనది ?" అని ఆదరాభి మానము లుప్పొంగగా పురాణ ప్రసిద్ధమగు ఆంజనేయుల వారి వాలమును బహుసున్నితముగ నిమురుచు ప్రశ్నించినారు.

శ్రీరాముల వారి మృదుహస్త స్పర్శతో ఆంజనేయుల వారి వాలమేకాక, శరీరముకూడ జలదరించి రోమములు నిక్కబొడుచుకొనగ గగుర్పాటుతో దీనవదనమున ఇట్లులనిరి.

"స్వామీ, మీకు తెలియని సంగతులేమున్నవి. నా కష్టములను నా నోటనే పలికించవలెననియా మీ కోరిక''.

"కష్ట"మను మాట వినగానే శ్రీరాములవారు నివ్వెరపోయి విస్మయ దృక్కుల తోడ నాంజనేయుల వారిని శిర, వాల పర్యంతము వీక్షించిన వారైరి.

తన పాలనము క్రింద దేశం సుభిక్షమై జనులెల్లరుగాలి, నీరు ఇత్యాదులు కరువులేక భక్షించుచు సుఖులై, శాంతులై, సంతృప్తులై యుండ రామరాజ్యమనుమాటకు వేరు దృష్టాంతము లేనంత సుప్రసిద్ధమై స్వర్గ, మర్త్య, పాతాళాది సకల జగత్తునందు ఖ్యాతివడసి ఆదిశేషువు యొక్క రెండువేల నాల్కల తోడ ననుక్షణంబు కీర్తింపబడుచున్నదని నిన్నగాక మొన్న నేగదా సకల మంత్రి, సామంత, శాసనసభ్య పరివేష్టిత రాజసభా మధ్యమున ఏబదిమంది వందిమాగధులు సభాభవనంబు దద్దరిల్ల ముక్తకంఠమున నుద్ఘోషించియున్నారు.

అట్టిది తన సేవకులలో నగ్రగణ్యుడు, మహాబలసంపన్నుడు, గుండెలు తీసి చూపుట కెరుగని పరమభక్తుడు ఈ ఆంజనేయునికా కష్టము వాటిల్లుట.

ఈ మహాబలున కెవ్వరెట్టి కష్టమును కలిగింపగలరు ? మనిషి సంగతటుండ, ఆ వాలమునందెంత శక్తిగలదు. అలనాడశోకవనమున నీచ రాక్షస కంఠమున కురిత్రాడై వారిని కిమ్మననీయక యమపురి కంపిన దీ వాలమే గదా ! రామదూత యనియైన గౌరవింపక సిందుసభలో నిల్చుండ బెట్టి యవమానింపజూచిన దశకంఠుని పాలిట పరాభ హేతువుగా మహో నన్నమై అంజనేయుని సేవించిన దీవాలమేగదా ! వరుణ, వాయు, సూర్య, చంద్రాదులనెల్ల శాసించి, సమస్త జగత్తునందలి సకల వైభవముల కొల్ల గొట్టి స్వపురంబున ప్రతిష్ఠించి, ఏ మహానగర వైభవమును జూచి దశ కంఠు డానందించునో ఆ లంకాపురిని, రావణుని మనసున కశనిపాత హేతువును, భవిష్యమున కపశకునమును కాగ క్షణకాలమున పరశురాము ప్రీతి గావించిన ఘనత ఈ వాలముదిగాదా ! ఈ వాలాధిపుడగు ఆంజ నేయునిదిగాదా ! అట్టి అంజనేయునికా కష్టము వాటిల్లుట. అందునా రామ రాజ్యమున.

ఈ ఆలోచనతోడ శ్రీరాములవారి కనుబొమలు ముడివడ తీక్షణ దృక్కులతోడ నాంజనేయులవారి దిక్కు మొగంబై ఆవేశముతోడ నిట్టులనిరి.

"ఆంజనేయా, ఏల తామసించెదవు. సందేహింపక వివరింపుము. నీకెట్టికష్టము వాటిల్లెను. నేనిదే మహామంత్రికి వర్తమానమంపి నీ కష్టమును పారద్రోలెదనుగాక. నీకట్టి కష్టముం గల్గించిన యట్టిపరిస్థితులేమో విచారించి నిర్మూలించెదగాక"యన.

"స్వామీ! నేనా మీకు వివరించువాడను. నేనా సకల ప్రాణి సమ్మోదన రామపాలనకు వంకలు బెట్టువాడను. జరిగినదేమో జరిగెను. ఆ పైన మిప్పుడేల? ఇంతదనుక రామనామ జపముతోడ రోజులు సుఖముగా వెళ్ళబుచ్చినాను. నే డేలనో విరక్తి కలుగుచున్నది. స్వామీ, సమయ మాసన్నమైనది. నాకింక మోక్ష మార్గోపదేశము చేయుడు. ఇదియే నా కోరిక".

"ఆంజనేయా నీ వింతకు అసలు విషయము వివరింపవైతివి. నా పాలనమున నీకా కష్టముగల్గుట. ఇది నే నెట్లు సహింపగలను. తక్షణమే నీ బాధాకారణము వెల్లడింపుము. నే తగుచర్య దీసుకొని నీ బాధాకారణము బాపెదగాక"యని వేడికోలు స్వరమున శ్రీరాముల వారనునయించగ గుండెదిటవు గలిగిన వారై ఆంజనేయుల వారిటులనిరి.

"స్వామీ, అయిన వినుడు. గతదిన ప్రాతఃకాలమున ఎప్పటి యట్లే సంధ్య యాచరించి యాకాశమార్గమున వచ్చుచుండ మార్గమధ్యము నందొక ఘోరాటవి నొక దారుణ దృశ్యము గాంచవలసివచ్చె...! ఒక కొండయంచున నొక మునిపుంగవు డొంటికాలిన నిలువబడి మహానిష్ఠా పరుడై ప్రాయోపవేశ దీక్ష వహించుచు మధ్య మధ్య నొక కన్ను దెరచి

లోక వ్యవహారములను గమనించుచుండె. గత ముప్పది దినములుగ నే నమ్మహానుభావుని నా స్థలమందదే స్థితిలో గాంచుచుంటిని. ఆ ముని పుంగవుని యచంచల దీక్ష, బ్రహ్మతేజ విరాజమాన ప్రశాంత, గంభీర వదనముజూడ నా కప్రయిత్నముగనె భక్తి భావ ముద్భవించెడిది.

"కాని...గత దినమున నమ్మహనీయునికి వాటిల్లిన దురవస్థను నేనెట్లు వివరింపగలను? పదుగురు రక్షకభటు లమ్మహాత్ముని సక లాయుధములతోడ జుట్టుముట్టి బందీకృతుని గావించి నోటబలవంతముగ నాహారము గ్రుక్క-సాగిరి. అమ్మహానుభావుని చిరదీక్ష నటుల నిర్మూ లనము గావించిరి.

"స్వామీ, ఇదియేమి యకార్యము. వెనుక రాక్షసులట్టి యకార్యము లంజేయ తాము స్వయముగా వారిని సంహరించితిరి. కానీ నేడు తమ భటులే అట్టి యకృత్యములకుం బాల్పడిరి. ఆ దారుణముంజూడ నాకా వేశము మెండయ్యెను. మహావేగమున నటుదూకి భటులను చెల్లాచెదరు జేసితిని. కాని, సాక్షాత్తు తమ సోదరులు భరతులవారే నా కడ్డువచ్చిరి అమ్మహనీయుని చీకటి కూపమున బడవేయ నాజ్ఞాపించి తిరస్కార భావముతోడ నన్ను గదిమిరి.

"ఏమి అంజనేయా! మా యన్నగార యుప్పుదినుచు వారి పాలనకే యెసరుబెట్టుచున్నావు" యని గద్దించిరి.

"స్వామీ! నా కెల్లను నయోమయమయ్యెను. నేనా తమ పాలన కెసరు బెట్టువాడను. నేనా! నా రాముని ధిక్కరించువాడను. స్వామీ, నా గుండెలను జీల్చి చూడు డందేమిగలదో. అయ్యో! ఎట్టిమాటలీ చెవుల వినవలసివచ్చెను, ఇంతకూ నేనేమి జేసితిని? ఒక అమాయక మునిపుంగ వుని రక్షింపనేగుట నేరమా స్వామీ! విచారింపుడు". గద్గద స్వరమున

అంజనేయులవారిట్లు జెప్పి తలవంచుకొనిరి.

శ్రీరాములవారీ కథా, కథనమెల్ల విస్మయాశ్చర్యాందోళనలతోడ విని దేహమెల్ల నావేశోత్పన్నమై వణక, కనులెర్రవారి సీతమ్మవారి నుదుటి సింధూరమువోలె వెలగ తక్షణమే భరతులవారినిం రావించి ఇటు లడిగిరి.

"సోదరా భరతా ! వింటివా వాయుపుత్రుని వాక్యములు. నిన్న నీవొక మునిపుంగవు నన్యాయముగ బంధించితివట. ఇది యేమి యకార్యము. దేశమున శాంతి భద్రతలను గాపాడు మహత్కార్యమును నీ భుజస్కంధముల నునిచి నేనింతదనుక నిశ్చింతుడనై మీ వదినగారితోడి పాచికలయాటయందు మునిగిదేలుచుంటిని. మరి నీవిట్టి పనులా చేయుచున్నది. ఇది ఏల సంభవించెను వివరింపు ?'' మనగా...

మకుళితహస్తులై భరతులవారిట్లు సెలవిచ్చిరి.

ప్రభూ ! అంజనేయులవారేమి సెలవిచ్చిరో నేనెరుగను. కాని నిన్నటి దినమున నొక మునివర్యుని బంధించిన మాట వాస్తవము. కాని ప్రభూ ! వాడొక దొంగ సన్యాసి. సద్గతులనుకోరి వాడు ప్రాయోపవేశమును బూనియుండలేదు. తత్కారణముననే నా కపటవర్తనుని బంధించితిని !".

''కాని, సోదరా ! భరతా ! జప తపము లాచరించుట యతి ప్రాచీనకాలము నుండియు జనులకుగల హక్కుగదా ! మరి నీవిట్లు నిరోధించుటెట్లు న్యాయమగును ?".

"ప్రభూ ! అవధరింపుడు. ఇటీవలి దేశ పరిణామములు మీ దృష్టి కింకను తేనైతిని. దేశమున నరాజకత్వము పెచ్చరిల్లెను. దేశీయులలో కొంద రధికారకాంక్షాపరులై ప్రజలలో నసంతృప్తిని లేవదీయుచుండిరి.

అట్టివారిలో నిన్న బంధింపబడిన ప్రాయోపవేశదీక్షాపరుడగు కపటముని పుంగవుడొకడు. వాడు మన పక్షీయుడుగాడు. ప్రభుత్వమును కూల ద్రోయనెంచిన ప్రతిపక్షీయ నాయకులలో నొకడు! కేవలము జనులలో సానుభూతిని బొందనెంచి వాడు ప్రాయోపవేశ దీక్షను బూనియుండెను. తత్కారణమున సకాలమున నేనా చర్యను నిరోధించితిని! ఇదియ జరిగి నట్టి విషయము. ఆ పైన తమ చిత్తము!" అని భరతులవారూరకుండిరి!

అందుకు శ్రీరాములవారు "అయినను భరతా! నీవీ సంగతు లెవ్వియు నా కింతదనుక తెలియపర్చకుండుట భావ్యముగలేదు!" అని ఇంచుక తీక్షణ దృక్కులను బరప వెండియు భరతులవారిట్లనినవారైరి!

"ప్రభూ! ఇవి కేవలము తాత్కాలిక విషయములు. ఎన్నికలు దగ్గరగుచున్నవిగదా! కనుక నేదో విధముగ జనుల దృష్టి నాకర్షించి నాయకులై తదుపరి "సీట్లు" సంపాదించి రాజసభయందు ప్రజా ప్రతి నిధిగ నొక్క వెలుగెలుగవలెనని కొందరు దుష్టబుద్ధు లిట్టి యకార్యము లకు బాల్పడుదురు. ఇవి యల్ప విషయములు. ఈ మాత్రమునకే మీ సమయమేల వ్యర్థము గావింపవలెనని నేనింతవర కెరిగింపనైతిని!"

అంతట శ్రీరాములవారు సంతృప్తులై, వాయుపుత్రుని దిక్కు మొగంబై "వింటివిగదా! ఆంజనేయా! కాలము చూడండి! దొంగ సన్యాసు లెక్కువగుచున్నారు. అందుకే భరతుడట్లా మునిని బంధించెను! అనగ నాంజనేయుల వారిట్లనిరి!

"స్వామీ! ఈ విషయమున మాత్రము భరతుల వారు పొరపడిరి! అతడు కపట ముని కాదని నాకు గట్టి నమ్మకము. నే నమ్మౌనీయుని గత ముప్పది దినములుగ జూచుచుంటిని!" యన, నందుకు రోష కషా యిత నేత్రులై భరతులవారిట్లనిరి!

"ప్రభూ! వాయుపుత్రుడు కల్లకపటము లెరుగని నిష్కల్మషుడుగ కనునట్లు మోసపోవుచున్నాడు. వాడు కపట సన్యాసి యనునిది వాస్తవము. వాడు ప్రాయోపవేశకాలమున జాటుగ ముప్పూటలు పులిహోర, దద్ధోజనాదుల మేయుచున్నాడని మన గూఢచారులు నాకు స్వయముగా నివేదించియుండిరి!"

అందు కాంజనేయులవారు నివ్వెరపోయి చెవులు మూసికొనిన వారై...

"పోనిండు స్వామీ! ఆ విషయము వదలివేయుడు. కాని, ఒక సందేహము; ముప్పూటను సుష్టుగ భుజించు వానినిబట్టి బలవంతమున నోట కాహారము గ్రుక్కి వ్రతభంగము జేసితిమని యానందింపనేల! ఆదటుండనిండు! నే నా దారుణచర్య కడ్డుదగల భరతులవారసహ్యించుకొని నన్ను బంధింప యాజ్ఞాపించిరి! అదేమనగ, రాచకార్యములను బ్రశ్నించుటకు నీ వెవ్వడవు? ముప్పూటల దిని మా యన్నగారి గుమ్మమున బడియుండువాడవు తెగ నీల్గుతున్నావు! నీవేమి మంత్రి పుంగవుడవా? మంత్రి బంధువుడవా? కనీసము రాజసభా సభ్యుడవా?''యని నిరాదరించినారు స్వామీ! ఇది యేమి యన్యాయము. పదుగురు సామాన్య భటుల ముందా నన్నట్లవమానించుట!"

అని ఆంజనేయులవారు రోషపూరితులై ప్రశ్నింప భరతులవారు గిజగిజ దన్నుకొనిరి! ఏమి, వీని యసందర్భాలాపము. సకల సేనాపతి నగు నా చర్యనే యాక్షేపించుచున్నాడు. నా యధికారమునే ప్రశ్నించుచున్నాడు. ఇంత దనుక అన్నగారికి తెలియకుండ జేసిన కార్యములెల్ల ఇపుడు తెలియునట్లు జేయుచున్నాడు! అని ఆగ్రహావేశులైరి! కాని, ఎదురుగనున్న శ్రీరాముల వారినింజూచి, చిరునగవు పెదవులపై దొణికిస

లాడ నత్యంతాదరమును ప్రదర్శించుచు ఆంజనేయులవారి దిక్కు-మొగంబై యిట్టులనిరి.

"ఆంజనేయా! నీ వట్లు బాధపడవలదు! రాజకార్యము లత్యంత ముఖ్యములు. చట్టము లతి నిశితములు. రాజాజ్ఞల నెవ్వరు నతిక్రమించ వీలులేదు, అడ్డురారాదు. మంత్రులు, మంత్రి బంధువులు, రాజసభా సభ్యులు మాత్రమే యందలి ఉచితానుచితముల గురించి మా తోడ ముఖాముఖిగా చర్చించుట కర్హులు. కనుకనే గత దినముల నీపై నే నట్లా గ్రహించవలసివచ్చె! అందుకు చింతిల్లకుము!" అని శ్రీరాములవారి కభిముఖుడై "అన్నా! వింటివిగదా! ఇదియే జరిగినట్టిది. నాకింక సెల వెందు!" అని సెలవు నందినవాడై వడివడిని వెడలె.

అంతట శ్రీరాములవారు ప్రసన్నవదనముతో వాయుపుత్రునితోడ నిట్టులనిరి!

"వింటివిగదా! ఆంజనేయా! యిందు భరతుని తప్పేమియు నా కగుపించుటలేదు. నీవేమందువు?"

"స్వామీ! నే నేమనగలను? కాని, గత దినమున నాకీ సంభవించిన యవమానమును మాత్ర మింకను మరువలేకున్నాను."

"ఆంజనేయా! నీవట్లనుకొనకుము. అందరు నట్లు చట్టములను భక్షింప నారంభించినచో నరాజకత్వము ప్రబలును. పోనిమ్ము! నీకంత కోరికయున్న యెడల నీవేల రాజసభకు సభ్యుడుగా యెన్నిక కాగూడదు."

"స్వామీ! మీ పాద సేవకుడను. నాకితర గొడవలేల! అయినను తెలియక అడుగుచుంటిని! రాజసభ కెన్నిక యగుట యననేమి? నాకిదేదో క్రొత్తగా వినిపించుచున్నది!"

"ఆంజనేయా ! కాలము మారినది ! రామరాజ్యమను మాట నీవు విననిదియా ! నేడు ప్రజలే పాలకులు. నేను కేవలము నిమిత్తమాత్రుడను. రాజసభయందు నాకు సహకరించు వారినెల్లరిని ప్రజలే ఎన్నుకొని పంపుదురు. అయినను నీ కేమిలోటు నీ స్వస్థానమున నీవన ప్రాణములిచ్చువారెందరో గలరుగదా ! అటకేగుము ఎన్నికలు దగ్గరగుచున్నవి. అట నుండి నీవు రాజసభ కెన్నికగుదువుగాక!"యని శ్రీరాములవారు లోన నుండి పాచికలాటకు పిలుపురాగ లోని కేగినవారైరి.

ఆంజనేయులవారంతట నొక యరగంట వరకు బుర్ర గోకికొని నల్లే యనుకొని ఋష్య మూకమునకు బయనమైరి.

## 2

ఆంజనేయుల వారట్లాకాశ మార్గమున మహా వేగమున బయనించి ఋష్యమూక మధ్యమందలి యొక చిన్న గుట్టపై నడుగిడ నా ధాటికి మహాశబ్ధమొకటి బయల్వెడలి ఋష్యమూక మందంతటను ప్రతిధ్వనించగా...

సుపరిచితమగు నా ధ్వని విని, ఋష్యమూక వాసులనేకులు "అడుగో మన ఆంజనేయుడు వచ్చె" నను నత్యంతోత్సాహమున గుట్ట వైపు జూడదొడగిరి.

అంత నాజన సందోహమునుండి నెత్తిన నొక తెల్లని గుడ్డ కిరీటమును, తోకకొక రంగులగుడ్డ పీలికయును గలిగి జూపుల నొక మహా నాయకునివోలె నగుపించు అంగదుడను నొక వానరు డతి రయమున ముందుకేగి ఆంజనేయులవారిని కౌగలించి, కుశల ప్రశ్నలువేసి సాదరమున స్వగృహమునకు తోడ్కొనిపోయినవాడాయెను.

ఆంజనేయ దర్శనార్థులై యేతెంచిన వారల కెల్లరకు చక్కటి పానకమ్మిప్పించి, అంజనేయులవారితో పాటు తానున్నూ కుశల ప్రశ్నలు వేసి, వారెల్ల రేగిన తదనంతర మేకాంతమున ఆంజనేయులవారి కొక పెద్ద పటిక బెల్లపు ముక్కను సమర్పించుకొని అత్యంత వినయశీలుడై అ యంగదు డిట్లనియె :

"అన్నా ! సకాలమున కేతెంచితివి. నే నింతవరకు దిక్కు తెలియక కొట్టుమిట్టాడుచుంటిని. నీవన్న నిచటివారలకెల్ల మహా గౌరవము నీవు నా పక్షము యుంటివేని రాజసభా సభ్యుడ నగుటయేమి ! మంత్రినే యయ్యెదను" యన నాంజనేయులవారా వాక్యము లేమియు నర్థముగాని వారై 'అంగదా ! నీవు చెప్పునదేమి ! నావల్ల నీకేమి సాయము గావలె' యని ప్రశ్నింప నా యంగదుడు తన తోకను సగర్వముగ బైకెత్తి దానికీగల గుర్తు పేలికలం జూపుచు నిట్లనియె.

'అన్నా ! ఎన్నికలు సమీపించుచున్నవి గదా ! నేను శ్రీరాముల వారి పక్షమున నిచ్చోటున నిలువ నియమింపబడినాడ. కాని, మన వానరు లెవ్వరు నాపై విశ్వాసముంచరైరి. తత్కారణమున రాజసభ కెట్లేగుదునా యను చింత యధికమయ్యె. నీవు నా గురించి వారికి హితవు చెప్పవలె, నన్ను గెలిపించవలె' అన నాంజనేయులవారు విస్మయమున,

'ఏమి ! నీవా ! రాజసభకు నిలబడుచుంటివా ? శ్రీరాములవారి పక్షముననా. ఏమీ ఇది నిజమా ! అయిన అంగదా, నీకేల శ్రీరాముల వారిపై నింతభక్తి పుట్టుకొచ్చెను. గతమున శ్రీరాములవారిని నీ వెంతగా నిందించితివి. వాలి నన్యాయముగ జంపినాడంటివి. పెళ్ళమును రావణు డెత్తుకబోవ దిక్కులేక నొంబేరివలె వానరుల సాయమపేక్షించి ఇటకొచ్చినాడని నిందించితివి. మరి ఇప్పు డిట్లనుచున్నావేమి?' యనగ.

'అన్నా ! నీవామాత్రము గ్రహింపలేవా ! కాలము మారినది. శ్రీరాములవారానా డేకాకియై కీకారణ్యముల దిరుగాడు యొక అనామకుడు. నేడా ! సకల జన సంకీర్తక అయోధ్యా పురాధీశుడు. కాలముతోపాటు మనమును మారవలదా. ఎండ దెబ్బకు వృక్షచ్ఛాయ నాశ్రయింతుము. వర్ష సమయమున గుహలందు తల దాచుకొందుము. ఈ మాత్రము నీ వెరుగనిదియా. ఇందు నా అపరాధ మేమిగలదు!'

'కాని అంగదా ! నన్నిట నిలబడి రాజసభ కెన్నికయి రావలసినదిగా శ్రీరాములవారు స్వయముగా నన్నిట కంపియున్నారే. మరి నేను నీకేమి చేయగలను' యన నా యంగదుడు దిగ్గునలేచి గుండెలు గుభీ, గుభీ, గుభీమని తెగ గ్రుద్దు కొనినవాడై,

'అన్నా ! ఆంజనేయా ! నీవా నా కెదురు నిల్చుట. ఇది యేమి యన్యాయము. నీతోడ పోటీకి దిగగల తాహతు నా కెక్కడిది. అయి నను నీకీ పదవులేల. ఏమి సాధింపగోరితివి, సంసారమా ! చట్టుబండలా సభ్యుడవయి నీ వెవరికేమి యొరగబెట్టెదవు. పర్మిట్లిప్పించెదమన్ననూ నీ కొక్క బావమరిదియైన లేడే. ఆస్తిపాస్తులు పోగుచేసుకొందమన్ననూ అనుభవించుటకు నీ వెనుక నెవ్వరునులేరే. శ్రీరామ పట్టాభిషేక సమయమున వెలలేని వజ్రహారములివ్వ వాటి నటనే బగులగొట్టిన డబ్బు విలువ తెలియని శుద్ధ యమాయకుడవు నీకీ పదవులేల ! యని యాక్రోశించె.

"ఆగు యంగదా. నీ వట్లనకుము. నేడు జరుగుచుండునట్టి యన్యాయ వర్తనముల నే సహింపనైతిని, శ్రీరాములవారందు కామోదించిరి. అంతియే చాలును."

"కానీ, అన్నా, నీ వెవరినుద్ధరింపనెంచితివి. ఈ జనులనా. అన్నా.

నీ వెంత యమాయకుడవు. ఈ కాలముననా ప్రజాసేవ జేయుట. అది
యెంత కష్టమో నీకేమి తెలియును మనల నెవ్వడర్థముజేసుకొని మెచ్చు
కొనును. ప్రతివాడు మనలనే వ్రేలెత్తి చూపును. 'ఆ వాహన మెట్లొ
ద్దిన'దందురు. 'అపాటి దిబ్బ ఎవడబ్బ దానమిచ్చె'నని దబాయింతురు.
'అ యడవి నీ బాబుసొమ్మని యాక్రమించితివా?'యని నిలవేయుదురు.
మరికొందరు గడుసుపిండములుందురు 'మెంబరయినాక నిగనిగలాడు
చున్నాడురా' యని కొందరన 'రాజధానిలో రోజుకు ముప్పదివరాలిత్తురు.
వానికేమి లోటని' కొందరందురు. 'మన ఊరిన బావి త్రవ్వించెదనంటివే
అదేమయినదని' కొందరు రోడ్డుననే నిలవేయ 'అవును. వీని నిక్కడనే
పాతిపెట్టిన ఆ నుయ్యి దానంతటదే తయారగునని కొందరందురు. అది
చాలక మరొకడెవడో పదుగురిని వెనకవేసుకుని తయారగును. "మా
యడతడింత పండితుడై యుండ వీనిని గాదని దొక్కచించిన నక్షరము
రాని నీ బావమరిది రెండో పెండ్లము పెదనాయనగారి తోడల్లుని మేనత్త
మనమనికా ఉద్యోగ మిప్పించితివట, ఇది యేమి న్యాయమ'నీ చీవాట్లు
పెట్టుదురు. అన్నా, ఆంజనేయా, శత్రువునకైన ఈ పాట్లు వలదు. నీకీ
పీడలేల. నిశ్చింతగ రామ నామ జపము జేసికొనుము" అని అంగదు
డత్యంత ప్రేమగలవాడై ఆంజనేయులవారికి రామరాజ్యముయొక్క విశ్వ
రూపమును అడుగకయె వివరించిన వాడవగ, ఆంజనేయుల వారున్నా
విస్మయాశ్చర్యములతోడ నాలోకించిన వారై తదనంతరమిట్లులనిరి.

"అంగదా, నీవు చెప్పినవెల్ల విన రామనామ జపమున మునిగి నే
నింతకాలము ఈ ప్రపంచ పరిస్థితులే తెలియని అజ్ఞానిగా మిగిలిపోతినని
నా కిప్పుడనిపించుచున్నది. వీనియంతు తేల్చుకొనవలెనని పట్టుదల
పెరుగుచున్నది. నాకు నీ వడ్డురాకుము." అన నా యంగదుడు క్రోధా
వేశుడై దిగ్గున లేచి రెండు నిలువులయెత్తున కొక్కసారెగిరిపడి గొప్ప

గడబిడజేసి, కనులకెంపులవగ, హస్తము లాంజనేయుని గొంతు పిసుకు టకై తహతహలాడుచు నావేశముతో కంపింపనెట్లొ నిగ్రహించుకొనిన వాడై ఇటన్నియె.

ఆంజనేయా! నీకు చెప్పవలసిన సంగతులన్నియు చెప్పినాడ. నీవు రాకరాక ఇటు వచ్చితివని ఎంతయో సంబరపడితిని. అనుదినము నీ కత్యంత ప్రీతిపాత్రమగు పటికబెల్లపు ముక్కలు, తాటిబెల్లపు లడ్డుండలు వలయునన్ని బెట్టి నిను సేవించుకొనవలె నని కొండంతగా యాశపడితిని. నీవు నా పక్షమున నున్న నన్నెవ్వడోడింపగలడని గుండె నిబ్బరము గావించుకొంటిని. కాని, నా యాశలెల్ల నిశ్శేషము గావించితివి. కానిమ్ము. నన్ను గాదని నీ విట నెటు నిలువగలవో జూచెదగాక. యని విసవిస లోనికరిగి, ధఢ ధఢ తలుపు లదరలాగి గడియవైచి ముసుగుదన్ని నిదురబట్టక తన్నుకొన దొడగె.

ఇట అంజనేయుల వారతివిచారముతోడ దిక్కుతోచనివారై తన బాల్య మిత్రులగు కొందరు వృద్ధులను దర్శించి తన యవస్త వివరించు కొన వారత్యానందముతోడ నా విషయములెల్ల విని యిట్లులనిరి.

"ఆంజనేయా! ఇన్నినాళ్ళకుగదా మా చెవుల తుప్పు వదలు గొట్టునట్టి శుభవార్తను వింటిమి. నీవు తిరిగి మామధ్య మెసలుచు మాకష్ట నిష్ఠూరములను గమనించుటకంటె మాకింకేమి కావలె! తప్పక మేమెల్ల రము నీ యండనుందుముగాక."

ఇది యిట్లుండ తెల్లవారుసరికి ఋష్యమూకమున వేడి వేడి వార్తలు వ్యాప్తమయ్యెను. 'ఆంజనేయుని శ్రీరాములవారు నిలబడమని పంపినారను నది యబద్ధము. వీడు శ్రీరాములవారి రత్నాభరణము నెత్తుకొనిపోయి కోమటివానికిచ్చి నూనె పకోడీలు తెచ్చుకొనగ శ్రీరాములవారు కోపించి

వెళ్ళగొట్టినారు.' అనియు "సీతమ్మవారినేకాంతముగ జూచి ఇకలించి కను సైగజేయ నామె యాగ్రహించి వెడల నడిపించె"ననియు జనులెల్లరు చెప్పుకొనసాగిరి.

ఆంజనేయులవారున్నూ, వారి మిత్రులున్నూ ఇట్టి వార్తలు విని "రామ రామ !" యనుచు చెవులు మూసికొనినవారైరి. మరి నాల్గు దినముల వరకును వారెవరికిని మోముజూప సాహసింపరైరి. ఇంతకును అట్టి అఖాండములెట్లు వ్యాపించెనో వారికి తెలియదయ్యె. కొందరిది అంగదుని పనియే యన నిరూపించిరిగాని ఆంజనేయులవారు నమ్మరైరి.

అంతట నంగదుడు విజృంభించినవాడై మహోత్సాహమున ప్రచారమారంభించె.

ఇంక నిట్లుండిన లాభములేదని ఆంజనేయులవారి మిత్రులెల్లరు సమావేశమై "అంజనేయా చూచితివిగదా వాతావరణము. అంగదుడు విపరీతముగ తప్పు వెదజల్లుచున్నాడు. మనచేత నొక్క వరహాయైనను లేదే ! ఏమి చేయుదము ?" అనగ ఆంజనేయులవారతి కష్టమున తన పురాణ ప్రసిద్ధమగు వాలమునొక వడ్డీ వ్యాపారియొద్ద కుదువయుంచియొక అరసంచెడు నాణెములు తెచ్చినవాడయ్యెను. కాని, అవి ఏమూలకు చాలవాయె.

అడిగినవారెల్ల నట్లే మా చీట్లు మీకేయుదుమనిరి.

కొందరు గడుసుపిండములు 'అయ్యో మీరట్లడుగ వలెనా ! మీకు గాక మరెవరికీయుదు'మని దీర్ఘములు దీయుచుబలికిరి.

మరికొందరు 'మాదేమున్నది ? మా గుంపు పెద్ద నడుగు'డనిరి.

ఆ పెద్దలు 'ఎన్ని సంచు లిచ్చెదరు ? మరెన్ని సీసాలు పోయించెద'రనీ బేరమాడదొడగిరి.

ఆంజనేయుల వారికీ వాతావరణమెల్ల నయోమయమయ్యె. ఏమి చేయుటకు తోచదాయె. పనులన్నియు మిత్రులపై నునిచి కొంతవరకు రామనామ జపమున మునిగిరి,

మరొక సుదినమున మరొక సుముహూర్తమున నేకాంత సమయమున శ్రీరాములవారిని దర్శించి సాష్టాంగ దండప్రమాణ మాచరించిన వారై ఆంజనేయులవారిట్లనిరి.

"స్వామీ నేను విసుగెత్తిపోయినాడ. దయయుంచి నాకు మోక్ష మార్గోపదేశము చేయుడు !"

అంతట శ్రీరాములవారాశ్చర్య పడినవారై "ఏమి ఆంజనేయా నీకిప్పుడేమయినది?" అని ప్రశ్నించినారు.

"స్వామీ ! మీ అజ్ఞాబద్ధుడనై ఋష్యమూకమునకేగి ఎన్నికలందు నిలబడితిని. సదా రామ నామమే జపించితిని. సన్మార్గమునే నే నాచరించితిని. కాని ఓడిపోతిని. కుదువయుంచిన నా తోకకూడ గల్లంతాయెను. అందుకు నేను విచారించుటలేదు. కాని అన్ని యక్రమమార్గములను యవలంభించిన అంగదుడు మాత్రము ఎన్నికాయెను. దౌష్ట్యమునకు పట్టము కట్టబడెను. నేనింక ఈ లోకమునుండి ఏమి జూడవలసియున్నదో ! స్వామీ, నా తొందరను క్షమింపుడు నాకు తక్షణమే మోక్షమార్గోపదేశము చేయుడు."

శ్రీరాముల వారంతయు శ్రద్ధగా నవలోకించి యించుక చింతించిన వారై ఆంజనేయులవారికి తారక మంత్రము నుపదేశించి వెంటనే నిట్లనిరి.

"ఆంజనేయా ! నీవు నా కెనలేని సేవజేసినావు. రాజకార్యమున పోయి నీవెన్నియో బాధలు భరించినావు. గాన నీ కిదే అయిదడవులు సర్వ హక్కులతోడ బహూకరించుచున్నాము. నీ వటకేగి తారక మంత్రము జపించుచు మోక్షసాధన నందెదవుగాక !

ఓం ! శుభం భూయాత్ !

★